ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
గురువారం 30 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	1,94,845	1,94,845
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	20,786.41	20,786.41
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.192 (40.0706)	42,330	57,477

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా ఏకధాటిగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. దీంతో జిల్లా అతలాకుతలమైంది. అన్ని మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వేల ఎకరాల్లో వరి పొలాలు నేలకొరిగాయి. మోకాళ్లల్లోతు నీళ్లు చేరి పంట పూర్తిస్థాయిలో దెబ్బతింది. పత్తి, మిర్చి చేలలో నీరు నిలిచింది. చేతికొచ్చిన పంట నీటిపాలుకావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువులన్నీ నిండుకుండల్లా మారి అలుగుపోస్తున్నాయి. పలుచోట్ల వాగులు, వంకలు ఉధృతంగా రహదారులపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

అన్నదాత విలవిల

ఉమ్మడి జిల్లాలో వర్షం ఇలా..

మండలం	వర్షపాతం (మి.మీ)
అడ్డగూడూరు	180.8
మోత్కూరు	179.8
ఆత్మకూరు(ఎం)	179.3
తుంగతుర్తి	146.5
ఆలేరు	142.5
నాగారం	137.5
శాలిగౌరారం	128.3
తిరుమలగిరి	121.8
అర్వపల్లి	109.0
గుండాల	104.3
మద్దిరాల	96.0
సూర్యాపేట	94.0
మోటకొండూరు	92.8
దేవరకొండ	78.8
యాదగిరిగుట్ట	70.3

- మొంథా తుపాన్ ప్రభావంతో రోజంతా వర్షం
- వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరి, పత్తి, మిర్చి
- జిల్లాలో పలుచోట్ల నిలిచిన రాకపోకలు

మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీవర్షం కురిసింది. జిల్లాలో 34.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తుంగతుర్తిలో 146.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మునగాలలో 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అర్వపల్లి, తిరుమలగిరి, నాగారం మండలాల్లో 13 సెంటీమీటర్లకు పైగా, మద్దిరాలలో 74 మిల్లీమీటర్లు, మోతెలో 55.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకే ఈ స్థాయిలో వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం వరకూ జల్లులు పడుతుండటంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ బుధవారం అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.



సూర్యాపేటలో కురుస్తున్న భారీ వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

నిలిచిన రాకపోకలు

జిల్లాలోని పలు రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. పలు గ్రామాల మధ్య రాకపోకలు సైతం నిలిచిపోయాయి. మఠంపల్లి మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణానదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. చౌటపల్లి-మేళ్లచెరువు, మఠంపల్లి- రఘునాథపాలెం ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచాయి. తిరుమలగిరి-నందాపురం వద్ద ఎంగపాలెం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ముందస్తుగా రాకపోకలు నిలిపివేశారు. మొండ్రాయి మీదుగా దారి మళ్లించారు. కోదాడ మండలంలోని నల్లబండ గూడెం, రెడ్లకుంట వద్ద గల పాలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కూచిపూడి వద్ద అంతర్గంగవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జి పైనుంచి నీరు

(మిగతా 8వ పేజీలో)

కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌లు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అత్యవసర సమయంలో ప్రజలకు అవసరార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటుచేసింది. డయల్-100తో పాటు 6281492368నెంబర్ అందుబాటులోకి తెచ్చారు. సూర్యాపేట మునిసిపల్ ఆధ్వర్యంలో 08684220049ను అదేవిధంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 8712686026లతో కంట్రోల్ రూంలను ఏర్పాటుచేశారు.

నెమ్మికల్ వద్ద గట్టికల్ స్టేజీ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



● చెట్టు మీద పడి ఒకరు మృతి

మద్దిరాల మండలంలో ఈదురుగాలులకు చెట్టు విరిగి లక్ష్మీనారాయణ అనే వ్యక్తిమీద పడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో మత్స్యకార్మికుడు చేపలవేటకు వెళ్లి చిక్కుకోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపోలీసులు అతడిని రక్షించారు.

అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తే తాత్కాలికంగా వాహనాల రాకపోకలు నిలిపివేయాలన్నారు. నదులు, చెరువులు, కాల్వల వద్ద ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ, పీఆర్ శాఖల అధికారులు పర్యవేక్షణ చేస్తూ ప్రజలు అటువైపు వెళ్లకుండా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అందులో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేటలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

అత్యవసరమైతేనే బయటకురావాలి



తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున అవసరమైతేనే బయటకురావాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిందన్నారు. నీటి ప్రవాహం ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద రాకపోకలు సాగించొద్దని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందని, సిబ్బంది సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశమున్న కల్వర్టులు, బ్రిడ్జిలు, నాలాలు, వంతెనల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలి



నేను 10 ఎకరాల్లో వరి సాగుచేశా. భారీగా పెట్టుబడి పెట్టాం. సుమారు 400 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అనుకున్నాం. ఈ తుపాన్‌తో పైరు నేలకొరిగి, నీళ్లలో పడిపోయింది. గింజలన్నీ రాలిపోయాయి. ఇప్పుడు 200 బస్తాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. కోత ఖర్చులు సైతం రెట్టింపు అవుతాయి. ఎకరాకు రూ.30వేల వరకు నష్టపోతున్నాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకొని పంటనష్ట పరిహారమివ్వాలి.

బొంత శ్రీనివాస్‌రెడ్డి, హుజూర్‌నగర్

15 ఎకరాల వరిసాగుచేస్తే 2.15 లక్షల నష్టం వచ్చింది



మేం 15 ఎకరాల్లో వరిసాగుచేశాం. తుపాను ప్రభావంతో సుమారు ఐదు ఎకరాల్లో పంట కిందకు ఒరిగింది. ఈ విపత్తులేకపోతే ఎకరాకు 40బస్తాల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 15బస్తాలకు మించి దిగుబడి రావడం కష్టంగా కనిపిస్తోంది. పంట నేలకొరిగిన ఐదెకరాలకు సంబంధించి మొత్తం రూ.2.15లక్షల నష్టపోవాల్సి వస్తోంది. కిందపడిన వరిపైరు కోయడానికి మిషన్‌కు రెట్టింపు సమయం పట్టి, ఆ వ్యయం కూడా పెరుగుతుంది. రైతులు తీవ్రంగా నష్టపోయిన అంశంపై ప్రభుత్వం పంటనష్టం అంచనావేయించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నాం.

-కమతం రాజేశ్వరరావు, తమ్మర, కోదాడమండలం

● మరోసారి అర్వపల్లి కస్తూర్బా విద్యాలయ ఆవరణలోకి వరద

అర్వపల్లి : అర్వపల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాల ఆవరణ భారీ వర్షానికి మరోసారి నీట మునిగింది. ఈ ఏడాది సెప్టెంబరులో కురిసిన వర్షానికి ఆవరణ మునిగిపోగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి ఆవరణలో నీరు చేరడంతో బాలికలు భయాందోళన చెందారు. పాఠశాల చుట్టూ నడుము లోతు నీరు చేరింది. తహసీల్దార్ శ్రీకాంత్ పాఠశాలకు చేరుకొని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. పాఠశాల్లో 198మంది విద్యనభ్యసిస్తున్నారు.



అర్వపల్లిలోని కస్తూర్బా విద్యాలయ ఆవరణలో చేరిన వరద



దొండపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

నిశీధిలో విషాదాలు

- ఉమ్మడి జిల్లాలో హైవేలపై నిత్యం ప్రమాదాలు
- అర్ధరాత్రి, తెల్లవారుజామునే అత్యధికం ● నిత్యం రద్దీగా హైవేలు ● చిన్న నిర్లక్ష్యానికి తప్పని మూల్యం

అమ్మో హైవే-2



చిట్యాల మండలంలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు(ఫైల్)

అతివేగం, నిద్రమత్తు, అజాగ్రత్త.. ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. నిత్యం 70వేల వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిపై అర్ధరాత్రి, తెల్లవారుజామున అత్యధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఓవర్ టేక్ చేసే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యానికి ప్రాణాలు పోతున్నాయి. జాతీయ రహదారిపై చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, కేతేపల్లి, మునగాల పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 195 ప్రమాదాలు జరగ్గా, 87 మంది మృతి చెందారు. 186 మంది క్షతగాత్రులయ్యారు. చౌటుప్పల్ మండలంలో అత్యధికంగా 119 ప్రమాదాలు జరిగాయి. జాతీయ రహదారిపై అతివేగం, నిర్లక్ష్యంతోపాటు రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే హైవేపై పోలీస్ పెట్రోలింగ్ నామమాత్రంగా ఉంటోందనే విమర్శలు ఉన్నాయి.

6

యూనిటీ మార్చ్‌ను విజయవంతం చేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మైభారత్, ఎన్ఎస్ఎస్ సహకారంతో జిల్లాలో నిర్వహించే సర్దార్ 150 యూనిటీ మార్చ్‌ను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు కేసరిదేవ్ సిన్హాజ్వాల కోరారు. మార్చ్ విజయవంతం కోసం ఢిల్లీ నుంచి బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. జాతీయ సమైక్యత, దేశభక్తి పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర ముఖ్యమైందన్నారు. జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ నెల 31 నుంచి నవంబరు 25 వరకు విడతల వారీగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సర్దార్ 150 యూనిటీ మార్చ్‌లో జిల్లా స్థాయిలో మూడు రోజుల పాదయాత్ర నిర్వహించాలని, ప్రతి పాదయాత్ర 8 నుంచి 10 కిలోమీటర్లు ఉండేలా చూడాలన్నారు. ఇందులో కనీసం 500మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. మార్చ్ విజయవంతానికి కలెక్టర్ అధ్యక్షతన కోర్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితానికి సంబంధించిన ఘట్టాలను ప్రజలు, యువతకు తెలియజేయాలన్నారు. వైద్యశిబిరాలు, ఎగ్జిబిషన్లు, యోగా క్యాంపులు, విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, వీధి నాటకాలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నవంబరు 12, 13వ తేదీల్లో పాదయాత్ర నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో అప్పారావు, జిల్లా యువజన, క్రీడల అధికారి రాజేష్, డీఈవో అశోక్‌కుమార్, డీఐఈవో భానునాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు కేసరిదేవ్ సిన్హాజ్వాల, జిల్లా నుంచి పాల్గొన్న అదనపు కలెక్టర్ సీతారామారావు, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

సాగర్, మూసీ జలాశయాల

గేట్లు ఎత్తివేత

● సాగర్ 20గేట్లు, మూసీ 8గేట్లు

మెయిన్‌లో..

వరద ధాటికి కృష్ణానదిలో

కొట్టుకుపోయిన పడవలు

శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై నిలిచిన రాకపోకలు

7

మూసీ పరవళ్లు..

దుందుభి దూకుడు

7

సీజేఐపై దాడి రాజ్యాంగంపై

దాడితో సమానం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మంద కృష్ణమాదిగ



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

సూర్యాపేటటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై జరిగిన దాడి ముమ్మాటికీ రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై జరిగిన దాడి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బార్ అసోసియేషన్‌లో జిల్లాకేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని గౌరవించనివారు దేశద్రోహులేనన్నారు. సీజేఐపై దాడి సంఘటనను దేశం మొత్తం ఖండించిందని, దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దళితుల ఆత్మగౌరవం కోసం, న్యాయవ్యవస్థ రక్షణ కోసం, రాజ్యాంగరక్షణ కోసం నవంబరు 1వ తేదీన హైదరాబాద్‌లో లక్షలాది మంది దళితులతో ఆత్మగౌరవ మహాప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహాజన లాయర్ల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దప్పుకు మల్లయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, ప్రధన కార్యదర్శి సుంకరబోయిన రాజు, సహాయకార్యదర్శి దావుల వీరప్రసాద్‌యాదవ్, వసంత సత్యనారాయణపిళ్లె, నూకల సుదర్శన్‌రెడ్డి, షఫిఉల్లా, ఫరుద్దీన్, మీసాల శ్రీనివాస్, మందుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లుమాదిగ, చింతలపాటి చినశ్రీరాములు, యాతాకుల రాజయ్య, చింత వినయ్‌బాబు పాల్గొన్నారు.

రైతులూ.. మూగజీవాలు జాగ్రత్త



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కోదాడ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నుంచి పశుసంరక్షణకు పశువైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్య, పశుసంవర్థక అధికారి దాచేపల్లి శ్రీనివాసరావు సూచించారు. ప్రాంతీయ పశువైద్యశాలను బుధవారం సందర్శించారు. వర్షాల బారి నుంచి పశుసంరక్షణకు పలు సూచనలు చేశారు.

- లోతట్టు ప్రాంతాల్లో పశువులను కట్టి ఉంచవద్దు
- ఇంటివద్ద లేదా ఏదైనా ఎత్తైన, నీరు నిలవని, వరదరాని ప్రాంతంలోనే పశువులను కట్టి ఉంచాలి.
- వర్షం కురిసే సమయంలో అప్పుడప్పుడూ పశువుల్ని కట్టి ఉంచిన ప్రాంతాలపై దృష్టి సారించాలి
- వర్షం సమయంలో పశువులను బయటకు మేతకు పంపొద్దు
- చెరువుల వద్దకు, కాల్వల వెంట నీటికోసం పశువులను తీసుకెళ్లొద్దు
- వర్షం తెరిపి ఇచ్చినప్పుడు ఒకవేళ మేతకు బయటకు వెళ్లిన తర్వాత వర్షం మొదలైతే వెంటనే పశువులను ఇంటికి తెచ్చుకోవాలి.
- చెట్లకింద పశువులు, గొర్రెలు, మేకలను ఉంచొద్దు.
- శిథిల పశువుల పాకలు, భవనాలకు దూరంగా పశువులను ఉంచాలి
- కరెంటు వైర్లు, స్థంభాలకు దూరంగా పశువుల్ని ఉంచాలి.

వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు

జీవో జారీ చేసిన ప్రభుత్వం

● కళాశాల కోసం ప్రైవేట్ భవనాలు సేకరణ

హుజూర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):హుజూర్‌నగర్ పట్టణంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటు కోసం పలు భవనాలను వ్యవసాయ శాస్త్రవేత్త, సీనియర్ సైంటిస్ట్, ప్రిన్సిపాల్ బి. అనిల్‌కుమార్ బుధవారం పట్టణంలో భవనాలు పరిశీలించారు. వ్యవసాయ కళాశాల మంజూరు చేస్తూ ఈ నెల 16న తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నెల 22న 140 జీవో జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ.124 కోట్ల వ్యయంతో హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మగ్దుమ్‌నగర్ ప్రాంతంలో వ్యవసాయ కళాశాల నిర్మించనున్నారు. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో కళాశాల ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ సైంటిస్ట్‌ను బి. అనిల్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. నూతన వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించి నవంబరు మొదటి వారంలోనే తరగతి గదులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజేందర్‌నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కళాశాలకు సంబంధించి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నవంబరు మొదటి వారంలోనే హుజూర్‌నగర్‌లో కళాశాలను ప్రారంభించనున్నారు. కళాశాల ప్రారంభానికి సంబంధించి ప్రైవేట్ భవనాలను పరిశీలిస్తున్నారు. నవంబరు మొదటివారంలో తరగతి గదులు నిర్వహించేందుకు ముందుగా ప్రైవేట్ భవాలను అద్దెకు తీసుకునేందుకు దృష్టి సారించారు. మొదటి సంవత్సరం 30 మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభించనున్నారు. 10 మంది విద్యార్థులు, మరో 20 మంది విద్యార్థినులతో కళాశాలను ప్రారంభించనున్నారు. 5 నుంచి 10 మంది ప్రొఫెసర్లు, మరో ఐదుగురు నాన్‌టీచింగ్ సిబ్బందితో కళాశాల ఏర్పాటుచేయనున్నారు. మొదటి ఏడాది 30 మంది అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులతో ప్రారంభం కానున్న కళాశాలలో రెండోఏడాది 120మంది విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.

పట్టణంలో ఏర్పాటుచేయనున్న వ్యవసాయ కళాశాలకు సంబంధించి తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్, వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన రూములు, విద్యార్థిని, విద్యార్థులకు వేరు వేరు హాస్టల్ వసతి కల్పించనున్నారు. పట్టణంలో అన్ని మౌలిక వసతులతో కూడిన భవనాలను పరిశీలించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది మార్చి 30న ఉగాది సందర్భంగా హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాల ఏరాటుకు హామీ ఇవ్వగా ఆరు నెలల్లోనే కళాశాల ఏర్పాటు కానుంది. ఎమ్మెల్యే, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరిక మేరకు హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాల మంజూరైంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టణానికి మంజూరైన కళాశాలను ప్రారంభించనున్నారు.



హుజూర్‌నగర్‌లో ప్రైవేట్ భవనాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్‌కుమార్


అభివృద్ధిలో మరో మైలురాయి



వ్యవసాయ కళాశాల హుజూర్‌నగర్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోతుంది. నవంబర్ మొదటి వారంలోనే నూతన కళాశాల ప్రారంభించబోతున్నాం. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండేందుకు వీలుగా సౌకర్యాలు ఏర్పాటుచేస్తాం. ప్రైవేట్ భవనంలో ముందుగా కళాశాల ఏర్పాటు చేయనున్నాం. వ్యవసాయ కళాశాల వల్ల ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతుంది.

- ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి

నిశీథిలో.. విషాదాలు



చిట్యాలలో చీకట్లో బస్సును ఢీకొట్టిన లారీ(ఫైల్)

అమ్మో హైవే-2

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జాతీయ రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారులపై ఏదో ఒక చోట ప్రమాదం జరిగి ప్రాణాలు పోతున్నాయి. ప్రధానంగా వేగంతో పాటు తెల్లవారుజామున నిద్రమత్తులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు జిల్లాల పరిధిలోని హైదరాబాద్-విజయవాడ హైవేపై బ్లాక్‌స్పాట్‌లు గుర్తించినా ప్రమాదాల నివారణ చర్యలు సరిగ్గా చేపట్టలేదు.

హైదరాబాద్-విజయవాడ రహదారిపై

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ రూరల్)

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ఈ ఏడాదిలో 119 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 25 మంది మృతి చెందారు. 102 మంది క్షతగాత్రులయ్యారు. ప్రమాదాలు ఎక్కువగా తెల్లవారుజామున జరుగుతున్నాయి. ఈ హైవేపై నిత్యం సుమారు 70వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అతి వేగం, నిద్ర మత్తు, హైవే రోడ్డు నిర్మాణ సైతం సక్రమంగా నిర్మించకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. డివైడర్ మధ్యలో ఎత్తైన మొక్కలు లేకపోవడంతో వాహనాల లైట్ల వెలుతురు ఎదురు వాహనాలపై పడటంతో కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నామమాత్రంగానే పోలీసుల పెట్రోలింగ్ సాగుతోంది.

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ఈ ఏడాదిలో 41 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 31 మంది మృతి చెందగా 34మంది గాయపడ్డారు. రెండు ప్రమాదాల్లో ఇద్దరి చొప్పున చనిపోయారు. ప్రమాదాల్లో ఎక్కువగా తెల్లవారుజామున జరగ్గా, అతివేగమే ప్రమాదాల తీవ్రతకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

ప్రమాదాలతో సమానంగా మృతుల సంఖ్య

(ఆంధ్రజ్యోతి-చిట్యాల రూరల్)

నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలో ఈ ఏడాదిలో 26రోడ్డు ప్రమాదాలు జరగ్గా 26మంది మృతి చెందారు. 42మంది గాయపడ్డారు. అత్యధికంగా ప్రమాదాలు వేకువజామున, అర్ధరాత్రి, సాయంకాలం జరుగుతున్నాయి. త్వరగా గమ్యం చేరుకోవాలనే తొందరలో వేగంగా వాహనాలను నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తితో పాటు వట్టిమర్తి స్టేజీని బ్లాక్‌స్పాట్‌లుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదాల నివారణంలో భాగంగా పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. చిట్యాల పోలీసులు ఉదయం, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

జంక్షన్లు, యూటర్న్‌ల వద్దే

(ఆంధ్రజ్యోతి-కేతేపల్లి)

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలో ఈ ఏడాదిలో 9 ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా 8మంది తీవ్రంగా గాయపడ్డారు. గత ఏప్రిల్ 13న చీకటిగూడెం బస్‌స్టేజీ వద్ద గల యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇనుపాముల నుంచి నకిరేకల్ పట్టణానికి వెళ్లేందుకు వీలుగా వైజంక్షన్ ఉంది. ఈ జంక్షన్ నుంచి నకిరేకల్ మండలంలోని 10 గ్రామాల ప్రజలతో పాటు కేతేపల్లి మండలంలోని 13గ్రామాల ప్రజలు నకిరేకల్ పట్టణంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ప్రతినిత్యం ఈ జంక్షన్ గజిబిజిగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి.

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఒక ఏడాదిలో 30 రోడ్డు ప్రమాదాలో 11మంది మృతి చెందారు. సుమారు 30 మందికి పైగా గాయపడ్డారు. వాహనాల అతి వేగం, నిద్ర మత్తుతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.



చిట్యాల సమీపంలో ప్రమాదంలో నుజ్జయిన కారు(ఫైల్)

నిద్రమత్తుకు ముగ్గురు పోలీసు అధికారులు

చౌటుప్పల్ మండలంలోని ఖైతాపురంలో తెల్లవారుజాము జరిగిన రోడ్డు ప్రమాదంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు పోలీసు అధికారులు మృతి చెందారు. ప్రమాదం జరిగిన తర్వాత ఆ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ అధికారులు కాని హైవే అథారిటీ, పోలీసు అధికారులు కాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

హైదరాబాద్-భూపాలపల్లి హైవేపై

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

యాదాద్రిభువనగిరి జిల్లాలో అతిపెద్ద హైవేల్లో హైదరాబాద్-భూపాలపల్లి జాతీయ రహదారి ఒకటి. ఈ హైవేపై రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. వాహనాలు నడిపే సమయంలో చిన్నతప్పిదాలతో ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు బీబీనగర్ మండలంలోని ఈ హైవేపై 34 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 10మంది మృతి చెందారు. 26 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ప్రమాదాలు అతి వేగం, నిబంధనలు పాటించకపోవడం వల్లే జరిగినవి. జిల్లా పరిధిలోని యాదాద్రి క్షేత్రంతో పాటు భువనగిరి స్వర్ణగిరి దేవాలయం, భువనగిరి శివారులోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం ఉంది. ఇక్కడి హైదరాబాద్ నుంచే కాకుండా అనేక ప్రాంతాల నుంచి ప్రతీ మంగళవారం శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. హైవే రద్దీగా ఉంటుంది. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



బీబీనగర్ సమీపంలోని ఎయిమ్స్ వద్ద అతి వేగంతో అదుపుతప్పి బోల్తా పడిన కారు(ఫైల్)

చౌరస్తా, రాయిగిరి- జమ్మాపూర్ వద్ద, గజ్వేల్-చిట్యాల (161హెచ్) జాతీయ రహదారిపై వడపర్తి, హన్మాపూర్ వద్ద పోలీసులు హాట్‌స్పాట్‌లను గుర్తించారు. అయినాప్పటికీ ఆయా ప్రాంతాల్లో ఎలాంటి హెచ్చరికలకు బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ ప్రమాదాలు రాత్రి వేళల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. జాతీయ రహదారికి సంబంధించి హైవే పెట్రోలింగ్ వ్యవస్థ పని చేస్తున్నప్పటికీ ప్రమాదాలు జరిగిన వెంటనే ఘటనా స్థలానికి సకాలంలో వెళ్లకపోవడంతో ప్రాణనష్టం జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాత్రి వేళల్లోనే...

భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు 63 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 19 మంది మృతి చెందారు. 46 మంది గాయపడ్డారు. ప్రధానంగా హైదరాబాద్-భూపాలపల్లి(165) జాతీయరహదారిపై అనంతారం

నివారణ చర్యలు తీసుకుంటున్నాం



నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలను ఓవర్‌టేక్ చేయాలనే ప్రయత్నంలో ప్రమాదాలకు కొనితెచ్చుకుంటున్నారు. డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా కేసులు నమోదు చేస్తున్నాం. అయినా ఆశించిన ఫలితాలు రావడంలేదు.

● ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో, బీబీనగర్

పెట్రోలింగ్‌కు డీజిల్ కరువు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

జాతీయరహదారులపై ప్రమాదాల నివారణకు, నష్టనివారణ చర్యలకు ఎంతో ఉపయోగపడే పెట్రోలింగ్ వాహనాలు నామమాత్రంగా పనిచేస్తున్నాయి. కేవలం ఎక్కడో ఒక చోట నిలుపుకుని ఉంటున్నారు. హైవే పెట్రోలింగ్ వాహనాలకు పెట్రోలింగ్ చేసేందుకు సరిపడా డీజిల్ కేటాయింపులు లేకపోవడంతో పెట్రోలింగ్ చేయకుండా ఎక్కడో ఒక చోట పార్కింగ్ చేస్తున్నట్లు సమాచారం. సూర్యాపేట పరిధిలో గతంలో పెట్రోలింగ్ చేసిన వాహనాన్ని ఇటీవల నిలిపివేశారు. దీంతో పెట్రోలింగ్ అనేది నామమాత్రంగా మారింది.

45 గొర్రెలు అపహరణ

భువనగిరి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 45 గొర్రెలు అపహరించారు. గ్రామానికి చెందిన మేడబోయిన బాలయ్య తన 150 గొర్రెలను మందలోకి తోలి ఇంటికి వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల మంద ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి సుమారు 45 గొర్రెలను వాహనంలో అపహరించుకుపోయారు. గొర్రెలను అపహరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. నలుగురు వ్యక్తులు వాహనంలో గొర్రెలను అపహరించుకుపోయినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంఘటనా స్థలాన్ని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ పరిశీలించారు. బాధితుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా గొర్రెల దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ పోలీసులను కోరారు.

దాడిచేసిన వారికి జైలు శిక్ష, జరిమానా

వలిగొండ, రామన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడి చేసిన ఆరుగురు నిందితులకు సంవత్సరం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బుధవారం తీర్పు వెల్లడించారు. వలిగొండ, రామన్నపేట ఎస్‌ఐలు యుగేందర్‌గౌడ్, నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని నర్సాపురం గ్రామంలో 2019 అక్టోబరు 12న కొందరు యువతులు, మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. ఆదే గ్రామానికి చెందిన కావటి మహేష్, నరేష్, శివ, సుదర్శన్, ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల రామకృష్ణ ఈలలు వేస్తూ మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ప్రశ్నించిన మహిళపై మరో వ్యక్తి ఐలయ్యపై నిందితులు దాడిచేసి గాయపర్చారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ శివనాగప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి నేరం రుజువైనందున ఆరుగురు నిందితులకు సంవత్సరం జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ రామన్నపేట అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శిరీష తీర్పు వెల్లడించారు. ఆధారాలు సేకరించి సాక్ష్యులతో సకాలంలో కోర్టులో చార్జిషీట్ సమర్పించిన పోలీసులను జడ్జి అభినందించారు.

కెమికల్ ట్యాంకర్ నుంచి ఒలికిన కెమికల్

● ఎగిసిపడిన నురగలు, పొగలు ● కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఘటన



టోల్‌ప్లాజా ఆవరణలో కెమికల్ ట్యాంకర్‌పై నీళ్లు చల్లుతున్న అగ్నిమాపక సిబ్బంది

కేతేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కెమికల్ ట్యాంకర్ అకస్మాత్తుగా టోల్‌ప్లాజా ఆవరణలో ఓ పక్కకు ఒరిగింది. దీంతో ట్యాంకర్‌లోని కెమికల్ ఒలికి రోడ్డుపై పడడంతో నురగలు, పొగలు ఎగిసి పడ్డాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, కేతేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు కెమికల్ లోడుతో వెళుతున్న ఓ ట్యాంకర్ బుధవారం సాయంత్రం కొర్లపహాడ్ టోల్ ప్లాజాలో టోల్‌రుసుం చెల్లింపు అనంతరం కౌంటర్ నుంచి బయటకు వచ్చింది. సాంకేతిక సమస్యతో అక్కస్మాత్తుగా ట్యాంకర్ ఎడమ వైపునకు వాలిపోయింది. దీంతో ట్యాంకర్‌లోని రసాయనాలు రోడ్డుపైకి ఒలికాయి. కెమికల్ రోడ్డుపై పడగానే నురగలు, పొగలు వచ్చాయి. అప్రమత్తమైన టోల్‌ప్లాజా సిబ్బంది కేతేపల్లి పోలీసులు, నకిరేకల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. టోల్‌ప్లాజాలోకి వచ్చే వాహనాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా సంఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలోని టోల్ కౌంటర్లను మూసి వేశారు. ప్లాజాలో ఇరువైపులా చివరి వైపున గల కౌంటర్లకు వాహనాలను మళ్లించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్‌ల సాయంతో ట్యాంకర్‌ను నిలిపారు. రోడ్డుపై నురగలు, పొంగలు ఎగిసి పడకుండా అగ్నిమాపక యంత్రాలతో నీరు చల్లారు. పరిస్థితి అదుపులోకి రావడంతో టోల్‌ప్లాజా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కెమికల్ ట్యాంకర్‌ను క్రేన్ల సాయంతో రోడ్డు పక్కకు తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



అయాజ్ మృతదేహం

నల్లగొండ క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లాకేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అయాజ్(23) కొద్ది రోజులుగా గడియారం సెంటర్‌లోని ఉర్సు ఉత్సవాల్లో ఓ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉర్సులోని షాపులో పనిచేస్తున్న అయాజ్ స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతున్న క్రమంలో విద్యుదాఘాతనికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ప్రభుత్వ భూములు కబ్జా

● కుంటలు, ప్రభుత్వ భూములు రక్షణ కరువు ● ఆక్రమణల విలువ రూ.11కోట్లపై మాటే ● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



రావి కుంటను ఆక్రమించి వరి సాగు చేసిన దృశ్యం

చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అక్రమణకు గురవుతున్నాయి. భూముల విలువలు భారీగా పెరగడంతో వాటిపై కబ్జాదారుల కన్ను వాటిపై పడింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామ పరిధిలోని కోట్ల రూపాయలు విలువ చేసే కుంటలు, ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేశారు.

● ఆంధ్రజ్యోతి, త్రిపురారం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు గ్రామ ప్రజా అవసరాల కోసం ఆరు ఎకరాల 27కుంటలో రావికుంట ఏర్పాటైంది. తర్వాత కాలంలో సాగర్ కాల్వలు తీసిన తర్వాత ఈ కుంటను నీటితో నింపడానికి కాల్వ ఏర్పాటు చేశారు. తర్వాతి కాలంలో ఈ కుంట, కాల్వను కబ్జాదారులు ఆక్రమించారు. చదును చేసి వరి పంటను సాగు చేస్తున్నారు. దీని విలువ ఎకరానికి రూ.30లక్షల చొప్పున రూ.2కోట్ల వరకు ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామ సమీపంలోని 8 సర్వే నెంబరులోని బండకుంట 2ఎకరాల 5కుంటల విస్తీర్ణంలో ఉంది. ఈ కుంటను ఆక్రమించి మట్టిపోసి ఇళ్ల ప్లాట్లుగా మార్చ దానికి ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు.

ఏనె గుట్ట మాయం

గ్రామానికి తూర్పు వైపున ఉన్న 26 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమి(ఏనెగుట్ట)ఉంది. ఇది సుమారు కిలో మీటరు పొడవునా విస్తరించి ఉంది. రాళ్లతో కూడి ఉండడంతో ఏళ్ల తరబడి పశువుల మేతకు ఉపయోగపడేది. కొంత కాలంగా ఏనె సమీపంలోని రైతులు రాళ్లను తొలగించి భూమిని చదును చేశారు. వరిసాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఏనె మొత్తం లో పూర్తిగా పెద్ద రాళ్లు ఉన్న భూమి మినహా సుమారు 20 ఎకరాల వరకు ఆక్రమించారు. దీంతో కనీసం పశువులు మేత దొరికే పరిస్థితి లేకుండా పోయిందని, దీని విలువ సుమారు రూ.6కోట్ల వరకు ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోమటిగూడెం సమీపంలో



కంపసాగర్ పరిధిలోని కోమటిగూడెం సమీపంలోని 275 సర్వే నెంబరులో 18 ఎకరాల 10 కుంటలు ప్రభుత్వ భూమి ఉంది. సుమారు 10 ఎకరాల వరకు పూర్తి స్థాయిలో కబ్జా చేశారు. మిగతా భూమిలో ఏనే రాళ్లు ఉండడంతో చదును చేయలేని పరిస్థితిలో వదిలేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.3కోట్లు ఉంటుంది. ఈ భూమిలో కొంత భాగాన్ని గ్రామస్థులు శ్మశానికి ఉపయోగిస్తున్న దానిని ఆక్రమించడంతో కొంత కాలంగా గ్రామస్థులకు, ఆక్రమణదారులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఫిర్యాదులు బేఖాతరు

కంపసాగర్ గ్రామంలోని ఆక్రమణలకు గురైన పలు ప్రభుత్వ భూముల విలువ సుమారు రూ.11కోట్ల పైనే ఉంటుంది. కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పాఠకుల సమాచారంతో 'ఆంధ్రజ్యోతి' పలు పర్యాయాలు కథనాలు ప్రచురించింది. గ్రామస్థులు తహసీల్దార్‌తో పాటు ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా వదిలేయడం ఆక్రమణదారులకు వరంగా మారింది. ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా అధికారుల నుంచి స్పందన ఉండటం లేదని, సర్వేయర్ లేరని చెప్పి సమస్య నుంచి తప్పుకుంటున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వేయర్ల కొరత ఉంది

సర్వేయర్‌ల కొరతతో కొంత జాప్యం జరుగుతుంది. కంపసాగర్‌లోని ఆక్రమణలకు తొలగిస్తాం. కబ్జాకు గురైన కుంట, ప్రభుత్వ భూములను సర్వే చేపట్టి స్వాధీనం చేసుకుంటాం.

ప్రమీల, తహసీల్దార్, త్రిపురారం

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు



ప్రజా అవసరాలకు ఉపయోగ పడే విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నా.. అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడం లేదు. ఆక్రమణదారులను గ్రామస్థులు ప్రశ్నిస్తే ఘర్షణకు దిగుతున్నారు. అంతా మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాఆస్తులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలి.

● మేదరి సైదులు, కంపసాగర్

తాటి గెలలను కాపాడుకున్నారు

● క్రేన్ సాయంతో కల్లు గీసిన గీత కార్మికులు ● యాదాద్రి భువనగిరి జిల్లాలో గీత కార్మికుల వినూత్న ఆలోచన

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గీత కార్మికులు తాటికల్లు తీయలేక పోయారు. వరుసగా మూడు నాలుగు రోజులు కల్లు తీయకపోతే తాటి గెలలు ఎండిపోతాయి. ఆ ప్రమాదం నుంచి గట్టెక్కడానికి, తాటి గెలలను కాపాడుకోవడానికి ఇద్దరు గీత కార్మికులు వినూత్నంగా ఆలోచించి క్రేన్ సహాయంతో కల్లు గీసి తాటి కల్లు గెలలను కాపాడుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన లగ్గోని పాండు, బుచ్చయ్యలు గీత వృతిపై ఆధారపడి జీవిస్తున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో తాటి చెట్లు ఎక్కలేకపోయారు. అసలే కల్లు సీజన్ కాకపోవడంతో ఉన్న కల్లు వచ్చే చెట్లను కాపాడుకోవాలని ఆలోచించారు. బుధవారం చౌటుప్పల్‌కు వెళ్లి రూ.3 వేలు చెల్లించి క్రేన్ మాట్లాడుకున్నారు. క్రేన్‌ను తాటి వనానికి రప్పించారు. ఇద్దరూ క్రేన్‌లో నిలబడి తాటి చెట్లపైకి వెళ్లి 10చెట్ల కల్లును తీశారు. కల్లు తాగడానికి పనికిరాకున్నా.. గెలలను కాపాడుకోవడానికి ఈ ఆలోచన చేశారు. ఈ సందర్భంగా గీత కార్మికులు మాట్లాడుతూ కల్లు తీయకపోతే గెలలు ఎండిపోయే ప్రమాదం ఉందని, వ్యయం అయినా, గెలలను కాపాడుకున్నామని తెలిపారు.



పంతంగిలో క్రేన్‌పై తాటి చెట్టు పైకి వెళుతున్న గీత కార్మికుడు పాండు

నాలుగు గంటలు వర్షంలో తడుస్తూ..

నార్కట్‌పల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న ముసురులో కూడా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి తన విధులను, బాధ్యతను సమర్థంగా నిర్వహించాడో అసిస్టెంట్ లైన్‌మెన్. తెగిన విద్యుత్ లైన్ ప్రదేశాన్ని గుర్తించేందుకు సుమారు నాలుగు గంటల పాటు ముసురులో తడుస్తూనే వెళ్లి సమస్యను గుర్తించి నాలుగు గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా అయ్యేలా చేశాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్ స్టేషన్ ద్వారా నక్కలపల్లితో పాటు సమీప గ్రామాలైన బాకిగూడెం, తుర్కబావి గూడెం, గద్దగూటిబావి తదితర గ్రామాలకు 11 కేవీ లైన్ ద్వారా గృహ విద్యుత్ సరఫరా జరుగుతోంది. మధ్యాహ్నం 1.30గంట ప్రాంతంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఏఎల్‌ఎం బండారు వెంకన్నకు ఫోన్ చేసి విద్యుత్ లైన్ తెగి సరఫరా నిలిచిపోయిందని సమాచారం ఇచ్చాడు. అయితే అప్పటికే ముసురు విడవకుండా కురుస్తూనే ఉంది. ఐనా కురుస్తున్న ముసురును కూడా లెక్కచేయని ఏఎల్‌ఎం వెంటనే సమస్యను గుర్తించేందుకు ట్రిప్ అయిన సంబంధిత విద్యుత్ లైన్ వెంట వెళ్తూ విద్యుత్ స్తంభాల తీగలను పరిశీలించాడు. చివరకు నక్కలపల్లి ఊరు చివర బతుకమ్మ కుంటలో ఉన్న 30వ పోల్ వద్ద విద్యుత్ లైన్ తీగ తెగి ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే ఆలోచించకుండా విద్యుత్ స్తంభం ఎక్కి 20 నిమిషాల్లోనే సమస్యను పరిష్కరించి పై నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాడు.




లైన్‌సరిచేస్తున్న ఏఎల్‌ఎం వెంకన్న

పెట్రోల్‌లో నీళ్లు.. వాహనదారుల నిరసన

కొండమల్లేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని సాగర్ రోడ్డులో గల హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో బుధవారం పెట్రోల్‌లో నీళ్లు కలిపి విక్రయిస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. బుధవారం 20మంది వాహనదారులు సదరు పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకోగా కొంత దూరం పోగానే వాహనాలు ఆగిపోయి ఇబ్బందులు పడ్డారు. అనుమానం వచ్చి మెకానిక్ వద్దకు వెళ్లగా పెట్రోల్‌లో నీళ్లు కలిపినట్లు నిర్ధారించుకొని బంక్ నిర్వాహకులను నిలదీశారు. బాటిల్‌లో పెట్రోల్‌లో నీటి శాతం అధికంగా ఉండడంతో వాహన దారులు బంక్ ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఆర్డీవో ఆదేశాల మేరకు అధికారులు పెట్రోల్ బంక్‌ను మూసివేశారు.

కాకితో కుటుంబం అనుబంధం

● మృతిచెందడంతో తీవ్ర మనోవేదన



అస్వస్థతకు గురైన కాకికి వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

దేవరకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన షేక్ యూసుఫ్ సఫియా కుటుంబానికి ఆరు నెలలకుపైగా కాకితో అనుబంధం ఏర్పడింది. పట్టణంలో పూల వ్యాపారం చేసే యూసుఫ్ సిల్వర్ జూబ్లీక్లబ్ ప్రాంతం కాలనీలో నివాసం ఉంటు న్నాడు. ఆరు నెలల క్రితం ఒక కాకి వారి ఇంటికి వచ్చి ఇంటి మీద వాలింది. గమనించిన యూసుఫ్ కుటుంబ సభ్యులు కాకికి బియ్యం గింజలు, చిరుధాన్యాలు, అన్నంతోపాటు అప్పుడప్పుడు చికెన్ కూడా ఆహారంగా వేసేవారు. దీంతో కాకి ఉదయం నుంచి సాయంత్రం వరకు యూసుఫ్ ఇంటి ఆవరణంలోనే తిరుగుతూ కుటుంబంలో ఒక్కరిగా ఉండేది. కాకి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటి పరిసరాల్లో ఉండి రాత్రికి వెళ్లిపోయేది. రెండు రోజుల క్రితం యథావిధిగా వచ్చిన కాకి వేసిన ఆహారం తీసుకోలేదు. దీంతో అనుమానం వచ్చిన యూసుఫ్ కుటుంబ సభ్యులు కాకి అస్వస్థతకు గురైందని తెలుసుకొని ఈ నెల 28న దేవరకొండ పశు వైద్యశాలకు సఫియాబేగం వైద్యం కోసం కాకిని తీసుకెళ్లింది. వెటర్నరి అసిస్టెంట్ కవిత కాకి అస్వస్థతకు గురైందని తెలుసుకొని ఇంజక్షన్ ఇచ్చి చికిత్స చేశారు. కాకిని ఇంటికి తీసుకురాగా అప్పటికే అస్వస్థతతో ఉన్న కాకి బుధవారం మృతిచెందింది. ఆరు నెలలకుపైగా రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటి ఆవరణంలోనే ఉంటూ కుటుంబంలో ఒకరిగా తిరిగిన కాకి మృతిచెందడంతో యూసుఫ్ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

మూసీ పరవళ్లు..దుందుభి దూకుడు

● జిల్లా అంతటా తుఫాన్ ప్రభావం ● స్తంభించిన రాకపోకలు





అలుగుపోస్తున్న భూదాన్‌పోచంపల్లి పెద్ద చెరువు, చౌటుప్పల్ మండలం పీపల్‌పహాడ్ వాగులో బైక్‌పై వెళ్తున్న వారిని కాపాడుతున్న స్థానికులు

బీబీనగర్/ భూదాన్‌పోచంపల్లి/ వలిగొండ/ గుండాల/ అడ్డగూడూరు/చౌటుప్పల్ రూరల్/ సంస్థాన్ నారాయణపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మూసీకి వరద పోటెత్తింది. హైదరాబాద్ పరిసరా ప్రాంతాల్లో మంగళవారం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మూసీకి వరద ఉధృతి పెరిగింది. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో మూసీ పరవళ్లు తొక్కుతు ప్రవహిస్తుంది. బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి- జూలూరు మధ్య లో లెవల్ బ్రిడ్జి పై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దాంతో ఉదయం నుంచే ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బీబీనగర్ మీదుగా పోచంపల్లి, చౌటుప్పల్ ప్రాంతాలకు నడిచే ఉప్పల్ , యాదగిరిగుట్ట డిపో బస్సులను రద్దు చేశారు. రెండు మండలాల గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇతరత్ర పనుల మీద భట్టుగూడెం, పెద్దరావులపల్లి, ముక్తానంతారం, పిలాయిపల్లి మార్గాల మీదుగా రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి ఇక్కడి ప్రజలకు దాపురించింది.కాగా ఇటీవల మూసీకి వరదలు పోటెత్తడంతో రుద్రవెల్లి - జూలూరు లో లెవల్ బ్రిడ్జి కొంత మేర దెబ్బతింది. జూలూరు వైపు బ్రిడ్జి రోడ్డు మార్గం కొట్టుకుపోగా రుద్రవెల్లి వైపు బ్రిడ్జి అడుగు భాగం కొంత మేర కూలిపోయింది. అయినప్పటికి తాత్కాలిక మరమ్మతులతో రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు మరోసారి మూసీకి వరద తాకిడి పెరగడంతో బ్రిడ్జి పరిస్థితి ఏమిటని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నీటి ప్రవాహం తగ్గితే తప్పా పరిస్థితి ఏమిటని అర్థం కాకుండా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న కారణంగా ఎక్కడ ధాన్యం తడిసిన దాఖలాలు కనిపించలేదు. భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూసీ పరివాహక ప్రాంతాల్లోని బ్రిడ్జీలపై సంచరించవద్దని భూదాన్‌పోచంపల్లి తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకటొరెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రాంతమైన భూదాన్‌పోచంపల్లి మండల వ్యాప్తంగా చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. వలిగొండ మండలంలో 64.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సంగెం పరిధిలోని భీమలింగం వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగెం బొల్లెపల్లి గ్రామాల నడుమ ఉన్న లో లెవల్ కల్వర్టు పై నుండి వరద నీరు భారీగా ప్రవహించడం వల్ల ముందస్తు జాగ్రత్తగా భారీ కెడ్లను ఏర్పాటు చేసి అధికారులు రాకపోకలను నిలిపివేశారు. సమీప ప్రాంత ప్రజలు మండల కేంద్రం మీదుగా సుమారుగా 20కి.మీ దూరం చుట్టూ తిరిగి తమ గమ్యస్థానాలకు వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దటూరు, వర్కట్‌పల్లి గ్రామాల నడుమ మూసీ భారీగా ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కురుస్తున్న ముసురు నేపథ్యంలో మూసీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. పత్తి వరి సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో రాశులుగా పోసిన వరి ధాన్యం తడిచి మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. గుండాల- నూనెగూడెం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిపై నుంచి ఏరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

● అడ్డగూడూరు మండలంలోని డి.రాపాక గ్రామంలో పోత్తిరెడ్డికుంటా ఉప్పొంగడంతో వరద నీరు ఇళ్లలోకి చేరింది. ఎస్.ఐ వెంకట్‌రెడ్డి తన సిబ్బందితో కుడిపోయిన కాల్వను రెండు జెసీబీల సహాయంతో కాల్వపూడిక తొలగించారు. అడ్డగూడూరు- గోవిందపురం గ్రామాలలో లో- లోలెవల్ వంతనపై నీరు ప్రవహించడంతో ఇరు గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రభావంతో బిక్కేరు వాగు నీటి ప్రవాహం పెరిగింది. అజీంపేట గ్రామానికి చెందిన పోగుల సత్తయ్య ఇల్లు వర్షాల కారణంగా కులిపోయింది.

● చౌటుప్పల్ మండలంలోని మండలంలోని మల్కాపురం, తంగడపల్లి, ఖైతాపురం, పంతంగి, దేవలమ్మనాగారం చెరువులు ఉధృతంగా అలుగుపోస్తున్నాయి. పత్తి వరి పంటలు నీట మునిగాయి. ఎస్ లింగోటం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరదనీరు చేరడంతో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో జేసీబీ తో వరద నీరు మళ్లించారు. పీపల్‌పహడ్ వాగులో బైక్‌పై కొట్టుకుపోతున్న ప్రయాణికులను స్థానికులు కాపాడారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తగ్గింది. వివాహది, శుభకార్యాలపై వర్షం ఎఫెక్ట్ పడింది. చౌటుప్పల్ పట్టణంలోని రామ్‌నగర్, విద్యానగర్ కాలనీలో ఇద్దరు వ్యక్తులు అనారోగ్యంతో మృతిచెందారు. వారి అంత్యక్రియలు వర్షంలోనే చౌటుప్పల్ శ్మశాన వాటికలో నిర్వహించారు. వర్షంతో అనేక మంది బంధువులు రాలేకపోయారు. కట్టెలు లభ్యం కాక ఇబ్బంది పడ్డారు.

● సంస్థాన్ నారాయణపురం మండలంలోని కడీలబాయి తండాలో కేలోతు రంజియాకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. ప్రమాద సమయాన ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. సుమారు 5 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సర్వేల్ గ్రామంలో కొత్తచెరువు నిండి అలుగు పోస్తోంది. దీంతో అలుగు కింది భాగంలో ఉన్న రైతుల పత్తి చేలలోకి వరద నీరు రావడంతో కొంత మేరకు నష్టం వాటిల్లింది.

బీబీనగర్ మండలంలో మూసీ ఉధృతి



పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

డిండి : తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. డిండి మండలంలో రాకపోకలు స్తంభించాయి. కందుకూరు వాగు కాజ్‌వే పై నుంచి నాలుగు అడుగుల మేర వరదనీరు ప్రవహించడంతో దేవరకొండ నుంచి కందుకూరు మీదుగా డిండికి రాకపోకలు నిలిచిపోయాయి. సింగరాజుపల్లి రిజర్వాయర్ నిండడంతో డిండి నుంచి వీరబోయినపల్లి మీదుగా సింగరాజుపల్లి రహదారిపై రాకపోకలు నిలిచాయి. సింగరాజుపల్లి నుంచి చారకొండకు, నిజాంనగర్ నుంచి కందుకూరు వెళ్లే ప్రధాన రహదారులపై నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. దేవరకొండ, డిండి ప్రధాన రహదారిపై లింగమయ్య వంపు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. దాసరి నెమలిపూర్ తండాకు చెందిన రమావత్ లక్ష్మీపతి తన రెండు ఎద్దులను పొలంలో చెట్టుకు కట్టివేయడంతో వాగు నీరు చుట్టుముట్టింది. ఎద్దులను కాపాడుకునేందుకు నీటిలో చిక్కుకుపోవడంతో స్థానిక యువకులు తాళ్ల సహాయంతో రైతును కాపాడారు. రూ.1లక్ష 70వేల విలువజేసే ఎద్దులు వాగునీటిలో మునిగి చనిపోయాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి నది: దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. డిండి ప్రాజెక్టుకు 36వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. అంతే మోతాదులో స్పిల్‌వే, వియర్‌ల మీదుగా నీరు దిగువకు విడుదలవుతోంది. డిండి ప్రాజెక్టు వియర్ నుంచి వచ్చే నీరు వెళ్లేందుకు శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారి 765పై నిర్మించిన బిడ్జి నీటి తాకిడికి కోతకు గురైంది. దీంతో బిడ్జిపై ప్రమాదం పొంచి ఉంది.

నీటి ఉధృతికి తట్టుకొని నిలబడిన డిండి ప్రాజెక్టు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంకాలంలో 1942లో నిర్మించిన డిండి ప్రాజెక్టు దుందుభి నీటి ఉధృతిని తట్టుకొని నిలబడింది. స్పిల్‌వే మీదుగా రెండున్నర అడుగుల మేర నీరు దిగువకు విడుదలవుతుంది. దుందుభి వాగు నుంచి 36వేల క్యూసెక్కుల నీరు డిండి ప్రాజెక్టుకు వచ్చి చేరుతుంది. డిండి ప్రాజెక్టు చరిత్రలో ఈ వరదను చూడలేదని వృద్ధులు చెబుతున్నారు. ప్రాజెక్టు లోపలి భాగంలో రివిట్‌మెంట్‌ను దాటి మట్టికట్టను నీటి అలలు తాకుతున్నాయి. ఇంతటి వరదను తట్టుకొని నిలబడిన డిండి ప్రాజెక్టు ఆనాటి పనితనాన్ని స్థానికులు చర్చించుకుంటున్నారు.

శ్రీశైలం - హైదరాబాద్ రహదారిపై నిలిచిపోయిన రాకపోకలు

శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారి 765పై బుధవారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. వియర్ దిగువన 765 జాతీయ రహదారిపై 2015లో నిర్మించిన బిడ్జి నీటి ఉధృతికి కోతకు గురైంది. దీనిపై వాహనాలు వెళ్లేందుకు ప్రమాదం పొంచి ఉండడంతో వాహనాలను ఉప్పునూతల, డిండి పోలీసులు నిలిపివేశారు. బుధవారం సాయంత్రానికి దుందుభి వాగుకు మరింత వరద ప్రవాహం పెరిగింది. దీంతో జాతీయ రహదారిపై ఉన్న బిడ్జికి తీవ్ర నష్టం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున డిండి వాగు పరివాహక ప్రాంతంలోని ప్రజలు వాగును దాటరాదని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ హెచ్చరించారు. వాగుదాటే ప్రయత్నం చేయకూడదని మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకూడదని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ముంచెత్తిన వాన



శాలిగౌరారం మండలం ఊట్కూరులో వరదను పరిశీలిస్తున్న అధికారులు

శాలిగౌరారం :మండలంలో దాదాపు 12సెంటీమీటర్ల వర్షపాతం నమోదైయింది. 30 ఏళ్ల తరువాత ఇటుకులపహాడ్ చెరువు, భైరవునిబండలోని గోరీల చెరువు 15 ఏళ్ల తరువాత, ఆకారం గ్రామ చెరువు 10 ఏళ్ల తరువాత నిండి అలుగుపోసింది. శాలిగౌరారం నుంచి మాదారం వెళ్లే రహదారిలో ఊట్కూరు వద్ద కాజ్ వే పై నీరు భారీగా ప్రవహించడం అధికారులు రాకపోకలు నిలిపి వేశారు. ఊట్కూరు నుంచి బండమీదిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలు నిలిచి పోయాయి.మండలం పలు ప్రాంతాల రోడ్లు, కల్వర్టులను పాఠశాల భవనాలు, చెరువులను కుంటలను శాలిగౌరారం తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి సిబ్బందితో పరిశీలించారు చేతికొచ్చిన వందలాది ఎకరాలల్లో వరిచేలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. చేతికొచ్చిన పత్తి చేను రంగు మారి కుళ్లిపోతుంది.

● నాంపల్లి :మండలంలో శేషాలేటివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నాంపల్లి నుంచి చండూరు, ముష్టిపల్లి వాగు పొంగి ప్రవహించడంతో దేవరకొండ నుంచి నాంపల్లి రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు నిండి అలుగులు పోశాయి. పంటనష్టంపై అంచనా వేస్తున్నామని ఏవో బండారు శివ తెలిపారు. ముష్టిపల్లిలో కాపులకుంట తెగిపోయి కుంట కింది భాగంలో భారీగా పత్తి, వరి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. అధికారులు త్వరలో కుంట గండి పూడ్చాలని రైతులు అన్నారు.

ఉరుమడ్ల-నేరడ రోడ్డుపైకి చేరిన చెరువునీరు

చిట్యాలరూరల్ : చిట్యాల మండలం ఉరుమడ్ల శివారులో ఉరుమడ్ల-నేరడ మార్గంలో చెరువు నిండి నీరు రోడ్డుపైకి చేరింది. సమాచారమందుకున్న పీఆర్ ఈఈ కె. గిరిధర్, డీఈ మహేష్‌కుమార్, ఏఈ సందీప్ బుధవారం పరిశీలించారు. పిల్లాయిపల్లి కాల్వ నీరు పెద్దకాపర్తి చెరువు నిండి అలుగుపోస్తూ నీరు ఉరుమడ్ల చెరువులోకి చేరుకుంది. అక్కడి నుంచి నీరు పొలాల ద్వారా ఎలికట్టె చెరువులోకి వెళ్తుంది. ఉరుమడ్ల-నేరడ గ్రామాలకు వెళ్ళే రోడ్డులో సుమారు 150 అడుగుల మేరకు నీరు రోడ్డుపైకి చేరి దాదాపు అడుగున్నర ఎత్తులో ప్రవహిస్తే రోడ్డు పైకి చేరింది. నీరు రోడ్డుపైకి చేరడంతో రెండు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● చింతపల్లి : మండల కేంద్రానికి చెందిన ఎండీ జహంగీర్ చాందిని కుమార్తె కలిసి రేకుల ఇంట్లో నివసిస్తున్నారు. పాత గోడలు కావడంతో పై కప్పు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఆకస్మాత్తుగా ఇళ్లు ధ్వంసం కావడంతో దిక్కుతోచని స్థితిలో మునిగిపోయాడు. అధికారులు స్పందించి ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేసే ఇళ్లలో తమకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

● నదిలో కోట్టుకుపోయిన పడవలు, వలలు

నాగార్జునసాగర్ :మొంథా తుఫాన్ సాగర్ మత్స్యకారులను నిండా ముంచింది. మంగళవారం నదిలో వేసిన వలలతో పాటు, నది ఒడ్డున ఉన్న పడవలు, వలలు గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో నదిలో కోట్టుకుపోయాయి. దీంతో మత్స్యకారుకలు సుమారు రూ. 5 లోల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ ఎడాది ఆగస్టు నెలలో సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదలు రావడంతో ఒకసారి వలలు, పడవలు కొట్టుకుపోయాయని, ప్రస్తుతం బుధవారం మొంథా తుఫాన్ వలన వలలు, పడవలు కోట్టుకుపోయయని ఆవేదన వ్యక్త చేశారు. పడవలు, వలలు కోల్పోయిన మత్స్యకారులల్లో ముసలయ్య, అప్పలరాజు, సత్యపురాజు, నాగరాజు, దేవుడు, యేసు, మసేను, కాశరాజు, రాజారావు, శ్రీను, కొండ ఉన్నారు.

రేపటి నుంచి మత్స్యగిరీశుడి బ్రహ్మోత్సవాలు

- కొలిచిన భక్తుల కొంగుబంగారం
- పుష్కరిణి తీర్థం అమృతతుల్యం
- కోరమీసాలు, నామాలతో శ్రీహరిదర్శనం
- రేపటి నుంచి నవంబరు 5 వరకు ఉత్సవాలు

వలిగొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మనోహరమైన, దివ్యమైన ఎత్తయిన కొండపైన స్వయంభూ శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువుదీరాడు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా శ్రీహరి



వలిగొండ మండల కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో యాదాద్రిభువనగిరి జిల్లాకు 32 కిలోమీటర్ల దూరంలో శ్రీ



శ్రీమత్స్యగిరి లక్ష్మీనర్సింహ స్వామిదేవాలయం (ఇన్‌సెట్‌లో) స్వామివారు

పూజలందుకుంటున్నారు. ఈ పుణ్యక్షేత్రం మత్స్యాద్రిగా దినదిన ప్రవర్ధమానం గా విరాజిల్లుతోంది. పుష్కరిణిలో స్వామివారు నామాలు, కోరమీసాలతో మత్స్యం (చేప) అవతారంలో దర్శనమివ్వడం ఈ ఆలయ విశిష్టత. తీవ్ర కరువుకాలంలోనైనా పుష్కరిణిలోని నీరు ఎండిపో దు. ఈ కొలనుతీర్థం సర్వరోగ ప్రదాయనిగా పేరుగాంచింది. పుష్కరిణిలో స్నానం ఆచరించిన భక్తులు మనసారా నారసింహుడిని ఆరాధించి ఆ తీర్థాన్ని తమ పంట పొలాల్లో చల్లితే చీడ పీడలు, ఎలాంటి రోగాలైనా తొలగిపోయి పాడి పంటలు సమృద్ధి చెందుతాయని భక్తుల విశ్వాసం. అక్టోబరు 31 నుంచి నవంబరు 5వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థానం పాలకమండలి, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముస్తాబైన ఆలయం

శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు అందంగా ముస్తాబైంది. గుట్టపైన చలువ పందిర్లు, ధగధగ మెరిసే విద్యుత్ దీపాలతో దేవాలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా దేవస్థాన పాలక మండలి, అధికారుల పర్యవేక్షణలో తీర్చిదిద్దారు.

ఉత్సవాలు సాగేదిలా..

అక్టోబరు 31 శుక్రవారం శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణము, శ్రీ విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజపత ఆదివాసనం, నవంబరు 1న శనివారం యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరణం, బేరీ పూజ, దేవతాహ్వానము, నిత్యహోమాలు, నవంబరు 2న శ్రీ స్వయంభుస్వామి వారికి నవకలశ స్నపనం, హనుమత్ వాహన సేవా, బలిహరణం నివేదన, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, ద్వారాతోరణ ధ్వజ కుంభ ఆరాధన, నవంబరు 3 సోమవారం ఉదయం ఎదుర్కోళ్ల మహోత్సవం, 11 గంటలకు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. నవంబరు 4 మంగళవారం శ్రీ సుదర్శన నారసింహ ఇష్ఠి, నివేదన, నవంబరు 5బుధవారం గరుడ వాహనసేవ, చక్రతీర్థం, దేవతోద్వాసనము, శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, ధ్వజావరోహణం, ఏకాంతసేవ, రుత్విక్‌సన్మానం, ఉత్సవ పరిసమాప్తి వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.




42 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం

మత్స్యగిరీశుడి సన్నిధికి చేరే మార్గంలో మేకల బండ వద్ద రెండు ఘాట్ రోడ్లు గుట్టపైకి చేరే ప్రదేశంలో భారీ ఎత్తయిన అభయాంజనేయ స్వామి విగ్రహం ఆకట్టుకుంటుంది. 42 ఫీట్ల ఈ విగ్రహాన్ని నార్మాక్ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మించాడు. మత్స్యగిరికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొండపైకి చేరుకోవాలి ఇలా...

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్ట ఉంది. దాతల సహకారంతో రెండు ఘాట్‌రోడ్ల ద్వారా వాహనాలపై భక్తులు చేరుకుంటారు. పూర్వకాలం నుంచి కాలినడకన మెట్ల మార్గం ద్వారా భక్తులు తరలివెళ్లి స్వామిని దర్శించుకుంటున్నారు. మెట్ల మార్గం నుంచి కూడా నూతన ఘాట్ రోడ్డు నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. శని, ఆది, సోమవారాల్లో భక్తుల రాకతో కొండ కిటకిటలాడుతుంది. ఈ రమణీయమైన ప్రకృతి అందాలతో 1400 మీటర్ల ఎత్తయిన కొండపైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి మత్స్యావతారంలో కొలువుదీరి ఉన్నాడు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు



మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు సంప్రదాయబద్ధంగా, నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. మహిమాన్వితమైన స్వయంభూ స్వామివారి బ్రహ్మోత్సవాలతో భక్తులు వేలాదిగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించాలి. స్వామివారి గర్భాలయ ప్రాంగణం బంగారు తాపడంతో అందంగా తీర్చిదిద్దాం.

\- కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, చైర్మన్

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. చలువ పందిర్లు, మంచినీరు. షామీయానాలు ఏర్పాట్లు చేశాం. బ్రహ్మోత్సవాలు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం.

\- మోహన్‌బాబు, ఈవో

లక్ష్మీ పుష్కరిణి నీరు నాణ్యమైనవే

● సీఎంవో ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు

యాదగిరిగుట్ట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీపుష్కరిణిలో నీరు నాణ్యమైనవేనని సీఎంవో ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు కితాబునిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి కొండకింద ఆధ్యాత్మిక వాడలో లక్ష్మీ పుష్కరిణిని బుధవారం ఆయన పరిశీలించారు. మేడారం అభివృద్ధి పనుల పరిశీలనకు బయలుదేరిన ఆయన మార్గమధ్యలో ఆలయ పుష్కరిణిని కూడా పరిశీలించారు. గోదావరి నది జలాలు ఇక్కడ చేరుతుండగా భక్తులకు పవిత్ర జలాలతో పుణ్యస్నానాలు చేస్తున్నారు. టర్బిడీటీ (క్రిస్టల్ క్లియర్), క్లోరిన్ శుభ్రంగా ఉన్నట్లు వివరించారు. ఆయన వెంట ఇంజనీరింగ్‌శాఖ సీఈ వసంతనాయక్, ఇన్‌చార్జి ఎస్ఈ రామరావు ఉన్నారు.



లక్ష్మీ పుష్కరిణిని పరిశీలిస్తున్న సీఎంవో ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం స్వామివారికి నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 9,17,614 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి కృష్ణ తెలిపారు. కొండకింద వ్రత మండపాల్లో 143 జంటలు సత్యదేవుని వ్రతాలు జరిపించారు.



కల్యాణం జరిపిస్తున్న పండితులు

మట్టపల్లిలో నృసింహుని కల్యాణం

మఠంపల్లి: రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరుగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, చెన్నూరి విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోదావరిలో ఆర్డీఆర్ అస్థికలు నిమజ్జనం

తుంగతుర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అస్థికలను బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఆర్డీఆర్ కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి సోదరులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణురెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోతు భాస్కర్, దండుమైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అస్థికలను గోదావరిలో కలపడానికి పూజలు చేస్తున్న సర్వోత్తమ్‌రెడ్డి

పీఆర్టీయూ సోషల్ మీడియా కమిటీ రాష్ట్ర సభ్యుడిగా మహమ్మద్ ఫరీద్



మహమ్మద్ ఫరీద్

నల్లగొండటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ సోషల్ మీడియా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ ఫరీద్‌ను నియమితులయ్యారు. నల్లగొండ పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతానికి సోషల్‌మీడియా పరంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్ రెడ్డి, భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం నారాయణరెడ్డి, జానారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో ముక్సిత్ ప్రతిభ

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి తైక్వాండోలో పోటీల్లో నల్లగొండకు చెందిన అబ్దుల్ ముక్సిత్ కాంస్యపతకం గెలుపొందాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నాగాలాండ్‌లోని చుముగోలో ప్రాంతంలో ఈ నెల 27వ తేదీన అండర్-14 నేషనల్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండకు చెందిన అబ్దుల్ ముక్సిత్ ప్రతిభ చాటి కాంస్య పతకం అందుకున్నాడు. 32 కేటగిరిల్లో బుధవారం జరిగిన పోటీల్లో ప్రతిభకనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో కాంస్యపతకం అందుకున్న ముక్సిత్‌ను నల్లగొండ జిల్లా తైక్వాండో కోచ్ మాస్టర్ ఎండీ యూనుస్ కమాల్, సీనియర్ క్రీడాకారుడు ఇంతియాజ్‌లు అభినందించారు.



ముక్సిత్‌ను అభినందిస్తున్న కోచ్ యూనుస్ కమాల్

మార్కెట్‌కు ధాన్యం జాగ్రత్తగా తీసుకురావాలి

సూర్యాపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు మార్కెట్‌కు ధాన్యం తడవ కుండా తీసుకురావాలని మార్కెట్ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున బుధవారం సూర్యాపేటలో మాట్లాడారు. లెచ్చిన ధాన్యాన్ని షెడ్లలో పోయాలి. రైతులు తీసుకువచ్చే ధాన్యం తడవకుండా అన్ని ఏర్పాట్లను సిబ్బంది చేయాలని ఆదేశించారు.

వరి 30 శాతమే ఒరిగింది

సూర్యాపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షానికి జిల్లాలో వరి 30 శాతం మాత్రమే ఒరిగిందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వర్షాల నేపథ్యంలో బుధవారం సూర్యాపేటలో ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారివర్గాలు తగ్గిన తర్వాత రైతులు పడిపోయిన వరిని పైకి లేపి కట్టాలన్నారు. మొలకలు, రంగు మార కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత వ్యవసాయాధికారులు పంట నష్టాని అంచనా వేస్తారన్నారు.

వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం



మద్దిరాల మండలంలో చెట్టు కూలి మృతిచెందిన వ్యక్తి



నేరేడుచర్లలో చెట్టు కూలడంతో ధ్వంసమైన గోడ



పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ బంధంపై భారీగా నిలిచిన వరద



భీల్యానాయక్‌తండాలో నేలవాలిన వరి పైరు



జాన్‌పహాడ్ దర్గా ప్రధాన రహదారిలో అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న అధికారులు



గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెంలో దెబ్బతిన్న వరిని పరిశీస్తున్న సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్



అనంతగిరి మండలంలో దెబ్బతిన్న వరిపైరు పరిశీలిస్తున్న మహిళా రైతు

తుఫాను జిల్లాలో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. పైర్లను తీవ్ర నష్టం కలుగజేసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లా పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను రెవెన్యూ అధికారులు, పోలీసులు పరిశీస్తున్నారను. వరద నీటికి వెళ్లొద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తమ పంట నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్

●భానుపురి: మార్కెట్‌కు తీసుకువచ్చిన ధాన్యం రంగు మారి మొలకలు వస్తున్నాయని రైతులు తెలిపారు. దీంతో మద్దతు ధర రాదని వాపోతున్నారు. పత్తి పైర్లకు 10 నుంచి 15 శాతం నష్టం వాటిల్లింది. వరి పైర్లు 30 శాతం వరకు ఒరిగాయి. జిల్లాలో పూర్తి స్థాయిలో కాంటాలు మొదలుకానందున కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం ఉంది. కోదాడ, చిలుకూరు, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, హుజూర్‌నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం, మోతె, ఆత్మకూర్(ఎస్), జాజిరెడ్డిగూడెం, అనంతగిరి, మునగాల, పెన్‌పహాడ్ మండలాల్లో 10మి.మీ కంటే ఎక్కువ వర్షాపాతం నమోదైంది.

●చివ్వెంల: చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్, సూర్యాపేట పట్టణం, రూరల్ మండలాల్లో కుండపోతగా వాన కురసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి, పత్తి పంటలు చేతికొచ్చే దశలో వర్షాలు పడటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వర్షానికి పత్తి నల్లగా మారి ప్రభుత్వ మద్దతు ధర రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

●పెన్‌పహాడ్: వర్షాలకు పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్ బంధంపై వరద నీరు భారీ నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ బంధంపై వంతెన నిర్మించి ఆరు దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలో 1,462 ఎకరాల్లో వరి పైరుకు, 27 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

●ఆత్మకూర్(ఎస్): వర్షానికి ఆత్మకూర్(ఎస్) మండలంలో 856 ఎకరాల్లో వరి పైరుకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి దివ్య తెలిపారు. నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయం సమీపంలో, నెమ్మికల్ గట్టికల్ గ్రామాల మధ్య వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెమ్మికల్ గ్రామంలో బొప్పని భద్రితో పాటు మరికొందరి ఇళ్లలోకి వరద చేరింది. ఏపూర్ వద్ద బిక్కేరు వాగు వంతెనను తాగు వరద నీరు ప్రవహించింది. ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో హసీం పర్యటించి వర్షం ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.



అర్వపల్లి మండల కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు



కోదాడలోని విభలాపురం వంతెనపు నుంచిప్రవహిస్తున్న వరద

కోదాడ నియోజకవర్గంలో..

కోదాడ: వర్షాలకు కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కోదాడ రూరల్, అనంతగిరి, నడిగూడెం, మోతె, మునగాల, చిలుకూరు, హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెర్వు, మఠంపల్లి, నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు మండలాలలో సుమారు 56 వేల ఎకరాల్లో వరి పైరు నెలకొరిగింది. 16,800 ఎకరాల్లో పత్తి పూత నేలరాలింది. మిర్చి తోటలు నీటిలో మునిగిపోయాయి. మోతె మండలంలోని మామిళ్లగూడెం నుంచి విభలాపురం వెళ్లే రహదారిపై నిర్మించిన వంతెనపై వరద ప్రవాహం అధికంగా ఉండటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. నామవరం, గుంజలూరు గ్రామాల మధ్య, ఉర్లుగొండ, నర్సింహులగూడెం గ్రామాల మధ్య నిర్మించిన వంతెనపై వరద ప్రవహించడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోదాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

కోదాడ రూరల్: కొత్తగూడెం మేజర్‌కాల్వకు వరద ఉధృతి పెరిగినందున మంగళ్‌తండా ఇళ్లలోని నీరు చేరింది. ఉల్కావాగులో వరద మంగళ్‌తండా సమీపంలో వంతెనకు అనుకుని నీరు ప్రవహిస్తోంది. కూచిపూడి వద్ద అంతర్గంగవాగు నీరు వంతెనపై నుంచి ప్రవహిస్తున్నందున 8గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. రామలక్ష్మీపురం, తమ్మర, తొగర్రాయి, కూచిపూడి, గుడిబండ, కాపుగల్లు, నల్లబండగూడెం గ్రామాల్లో రెండు పైగా ఎకరాల్లో వరి నీటమునిగింది.

నిలిచిన రెండు గ్రామాల మధ్య రాకపోకలు

మునగాల: వర్షాలకు కలకోవ, జగన్నాథపురం రహదారిపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెండు గ్రామాల రాకపోకలు నిలిచాయి. ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేదని సామాజిక కార్యకర్త పాతకొట్ల నాగరాజులు అన్నార్కు,న జిల్లా అధికారులు స్పందించివంతెన నిర్మించాలని కోరారు. రెండు గ్రామాల కార్యదర్శులు స్పందించి వరద నీటిలోకి ప్రజలు వెళ్లకుండా రోడ్డుకు ఇరువైపులా కంచెను వేయించారు.



కలకోవ, జగన్నాథపురం గ్రామాల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మండలంలోనే సుమారు 10వేల ఎకరాలల్లో వరి పైరు దెబ్బతింది. డివిజన్ వ్యాప్తంగా సుమారు 30వేల ఎకరాల్లో పైర్లకు నష్టం వాటిల్లినట్లు రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. పట్టణంలోని లింగగిరి రోడ్డు, మట్టపల్లి రోడ్డు, వేపలసింగారం రోడ్డుతో పాటు గోపాలపురం, బూరుగడ్డ, లింగగిరి, అమరవరం, లక్కవరం, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని సుమారు 18వేల హెక్టార్లు ఉండగా నాలుగువేల హెక్టార్లకు పైగా పంటలు నేలకొరిగాయి. మేళ్లచెర్వు: మండలంలో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి రోడ్డు వెంబడి పలు చెట్లు కూలాయి. మండలంలో సుమారు 1000ఎకరాల్లో పత్తి, 500ఎకరాల్లో వరిని సాగు చేశారు. వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లింది. మేళ్లచెర్వు, చింతలపాలెం గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్ పాస్ వంతెన కిందకు వరద నీరు చేరంతో రాకపోకలను వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

●నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో వరి పైర్లు నేలవాలాయి. అధికారులు పంట నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. నేరేడుచర్లలోని ప్రగతి విద్యాలయం సమీపంలో రమణ గోదాంలో చెట్టు కూలడంతో ప్రహరీ ధ్వంసమైంది.

●పాలకవీడు: పాలకవీడు మండలంలో 90శాతం మంది రైతులు వరి సాగు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న 50శాతం వరి పైర్లు నెలకొరిగాయి. పలు ప్రాంతాల్లో వరి పైర్లు నీటమునిగాయి. రాఘవాపురం సమీపంలో వేములూరి వాగుపై ఉన్న వంతెన కింద భాగంలో చెత్త పేరుకుని వరద నీరు వంతెన పైనుంచి ప్రవహిస్తున్నందున రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో చెత్తను తొలగించారు.

●మఠంపల్లి: వర్షంతో మట్టపల్లి వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. యాతవాకిళ్ల చెరువుతో పాటు చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు, బక్కమంతులగూడెం, అల్లీపురం చెరువు అలుగులు పోస్తుండటంతో ఆయకట్టులో సాగు చేసి వరి పైర్లు నీటినముగిగాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో చౌటపల్లి- మేళ్లచెరువు, మఠంపల్లి- రఘునాథపాలెం ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచాయి. యాతవాకిళ్లలో వృద్ధురాలు బొమ్మకంటి ఆదెమ్మ మంగళవారం రాత్రి కూలింది. చౌటపల్లి చెరువు అలుగును అధికారులతో కలిసితహసీల్దార్ మంగా పరిశీలించారు. లోతటు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు.

●చింతలపాలెం: వర్షాల ప్రభావంతో మండలంలో వాగులు, వంకలు, ప్రమాదకర స్థాయిలో పొంగి పొర్లుతున్నాయి. దొండపాడు నుంచి జగ్గయ్యపేట, గుడిమల్కాపురం దొండపాడు వెళ్లే మార్గంతో ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున రాకపోకలు ఆగాయి. ఎర్రవాగు వద్ద వంతెనపై నుంచి ప్రవహించే వరదను కోదాడ రూరల్ సీఐ ప్రతాపలింగం పరిశీలించి, ఈ వంతెనపై నుంచి రాకపోకలు చేయొద్దని ప్రజలకు సూచించారు.



హుజూర్‌నగర్ మండలం లింగగిరిలో నేలకొరిగిన వరి పైరు



మేళ్లచెర్వులో అండర్ పాస్ వంతెన కిందకు చేరిన వరద

తుంగతుర్తి నియోజకవర్గంలో..

తుంగతుర్తి: తుంగతుర్తి మండలంలో అత్యధికంగా 110.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. మండలంలోని అన్ని చెరువులు అలుగులు పోస్తున్నాయి. గ్రామాల శివారులో ఉన్న బండల మీద పోసిన ధాన్యం కొట్టుకుపోయింది. వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లింది. సంగెం, వెంకేపల్లిల మధ్య ఉన్న చెరువు అలుగుపోయడంతో సంగెం, వెంకేపల్లి, కోడూరు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. రోడ్డు కోతకు గురైంది. రుద్రమ చెరువు అలుగు పోయడంతో అక్కడ వస్తున్న నీరు ఉధృతంగా ప్రవహించడంతో సంగెం కోడూరు మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పూర్తికానందున సంగెం, కోడూరుల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

● అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలంలో 24 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దైంది. మండలంలో 10వేల ఎకరాల్లో వరి పైరు నేలవాలింది. అర్వపల్లిలో పలు ఇళ్లలోకి వరద చేరింది. రామన్నగూడెం పీఏసీఎస్ కేంద్రంలో బండపై ధాన్యం పోయడంతో కొట్టుకుపోయింది. 10 గొలుసు కట్టు చెరువులతో కూడిన కోడూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున రాకపోకలు బంద్ అయ్యాయి. ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. ప్రజలను ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ల సాయంతో తరలిస్తున్నారు. కోడూరు వాగు ఉధృతిని తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ సైదులు, ఎంపీడీవో గోపి పర్యవేక్షిస్తున్నారు. సూర్యాపేట-జనగాం రహదారిపై నీరు చేరడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. జాజిరెడ్డిగూడెం-వంగమర్తి గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

● నూతనకల్: వర్షంతో ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రోజంతా వర్షం రావడంతో జీవాలు, పశువులు మేతకు ఇబ్బంది పడ్డాయి. తాళ్లసింగారం రామసముద్రం అలుగు వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నందున తాళ్లసింగారం-పాతర్లపాడ్ గ్రామాల మధ్య రాకపోకలను అధికారులు నిలిపివేశారు వరద ప్రవాహాన్ని ఐకేపీ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఏఈ కల్యాణ్, ఆర్ఐ హసన్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్ పరిశీలించారు.

●నాగారం: మండలంలోని ఫణిగిరి, నాగారంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. మండలంలోని పస్తాల గ్రామంలో చెరువు అలుగు పొస్తుండడంతో బందం వద్ద రాకపోకలు నిలిచాయి. పస్తాల, లక్ష్మాపురం గ్రామాల్లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదను తహసీలార్ హరికిషోర్‌శర్మ, ఎంపీడీవో భీమ్‌సింగ్ పరిశీలించి ప్రజలకు తగు సూచనలు చేశారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని గుండెపురి, తొండ, వెలిశాల, జలాల్‌పురం, తాటిపాముల, బండ్లపల్లి, మామిడాల గ్రామాల చెరువులు అలుగులు పోస్తున్నాయి. ఎంగపాలెం వాగు అలుగు పోయడంతో తాటిపాముల గ్రామానికి నందాపురం మీదుగా వెళంల రహదారిలో రాకపోకలు నిలిచిపోవడంతో మొండ్రాయి మీదుగా దారి మళ్లించారు.. మామిడాల రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 45 మంది రైతుల సుమారు 20 లారీల ధాన్యం తడిసింది.. తొండ గ్రామంలో కొంత మంది ఇళ్లలోకి నీరు చేరింది.

● తిరుమలగిరి: వర్షాలకు వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. తిరుమలగిరి మునిసిపల్ పరిధిలోని చెరువులు అలుగు పోస్తున్నాయి. తిరుమలగిరి నందాపురం వద్ద ఎంగపాలెం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో అధికారులు ముందస్తు చర్యగా రహదారిని మూసివేశారు. మునిసిపల్ కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంతలో నడవనందున పెట్టుబడి రాక నష్టపోయామని చిరు వ్యాపారులు తెలిపారు వరదల పరిస్థితిని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించారు.



మాలిపురంలో అలుగుపోస్తున్న చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

సంఘాల పటిష్ఠతకు కృషి చేయాలి

నూతనకల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో సంఘ బంధాలను పటిష్ఠం చేయడానికి సభ్యులు కృషి చేయాలని సెర్ప్ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ వసంత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నూతనకల్ 1వ సంఘ బంధం సభ్యులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. సంఘ బంధాల కమిటీల ఎంపిక, వాటి నిర్వణ, సంఘాలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో సురేష్, డీపీఎం బెనర్జీ, ఏపీఎం వెంకట్‌రెడ్డి, సీనియర్ సీఆర్పీలు అరుణ, ధనమ్మ, సరిత, వీవోఏ బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వసంత

రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలి

సూర్యాపేట టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుడకుడ ప్రాంతంలోని రహదారిపై ఏర్పడిన గుంతల వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో రోడ్లన్ని రెండేళ్ల నుంచి గుంతలమయంగా మారడతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారని అన్నారు. ఈ రోడ్లలో సరిగా నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదన్నారు. సూర్యాపేట దంతాలపల్లి రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని, అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, ఐతరాజువెంకన్న, ఐతరాజుపద్మ, గౌరమ్మ, విన్ను, ఖాదర్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో గల గుంతల వద్ద నిరసన తెలుపుతున్న మాస్‌లైన్ నాయకులు

అన్నదాత విలవిల

(5వ పేజీ తరువాయి)

ప్రవహిస్తుండడంతో 8 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏపూర్ వద్ద బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

వేల ఎకరాల్లో దెబ్బతిన పంటలు

తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు జిల్లావ్యాప్తంగా వరి పంట దెబ్బతింది. వేల ఎకరాల్లో పంట నేలకొరిగింది. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో సుమారు 56 వేల ఎకరాలలో వరి నేలకొరిగింది. అదేవిధంగా సుమారు 16,800 ఎకరాల్లో పత్తి పూత నేలరాలింది. అదేవిధంగా వందల ఎకరాలలో మిర్చి తోటలు నీట మునిగాయి. సుమారు రూ.200 కోట్ల మేర నష్టం జరిగిందని రైతులు అంచనా వేస్తున్నారు. అర్వపల్లి, హుజూర్‌నగర్ మండలాల్లో 10వేల ఎకరాలల్లో వరి పంట నేలవాలింది.

కన్నీళ్లు మిగిల్చిన వర్షం

వర్షంతో పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. కొద్ది రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షానికి వరి పంట నేలవాలిపోగా, పొలాల్లో వరదనీరు చేరిందని రైతులు వాపోతున్నారు. ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. జిల్లాలో 4.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా చేశారు. ఇప్పటికే తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, తిరుమలగిరి, నూతనకల్, నాగారం, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో కొంతమంది రైతులు వరికోతలు కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అదేవిధంగా జిల్లాలో 92,588 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 8 నుంచి 9లక్షల క్వింటాళ పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు ప్రస్తుతం వర్షాలు పంట దెబ్బతినడంతో కేవలం 7లక్షల క్వింటాల పత్తి వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుత వర్షంతో పంట నష్టం 20శాతం వరకు ఉంటుందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

రహదారులు ఛిద్రం

భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లా కేంద్రంలోని కుడకుడ, కొత్తబస్టాండ్, విద్యానగర్‌తో పాటు జిల్లా కేంద్రంలోని పలు రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అర్వపల్లిలోని వీధులు జలమయమయ్యాయి. మోతె, పెన్‌పహాడ్. ఆత్మకూర్(ఎస్), జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్, కోదాడ, హుజూర్‌నగర్ మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు వరదనీటితో మారాయి.

10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

మోతె : భారీ వర్షాలకు మోతె మండలంలోని చెరువులు, కుంటలు వాగులు అలుగులు పోస్తున్నాయి. దీంతో కింది భాగంలో వరి, పత్తి, మిరప తోటల్లోకి నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. విభలాపురం-మామిళ్లగూడెం మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ దారిలో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఉర్లుగొండ-నర్సింహాపురం మధ్యలోని పాలేరుకు వెళ్లే బ్రిడ్జి మీదకు వరద పెరగడంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. నామవరం పెద్దచెరువు పెద్ద ఎత్తున అలుగుపోస్తుండడంతో ప్రజలు వెళ్లకుండా రోడ్డును మూసివేశారు. రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామంలో సగానికి పైగా మీటర్లు, ఫ్రిజ్‌లు, మోటార్లు, టీవీలు పగిలిపోయాం

ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి

హుజూర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాసు కోరారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో సీపీఐ 100 వసంతాల ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 30న హుజూర్‌నగర్ పట్టణంలోని జీవీపీ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాసరావు, దేవరం మల్లేశ్వరి, మామిడి వెంకయ్య, వెంకటేశ్వర్లు,పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లసాధన సదస్సును విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నవంబరు 1వ తేదీన జరిగే బీసీల 42శాతం రిజర్వేషన్ల సాధన సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్, జనసమితి జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీజేఎస్ కార్యాలయంలో సదస్సు వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టి చట్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి గోపి, వీరేష్‌నాయక్, బాషబోయిన వేణు, రాజు, ఫరుద్దీన్, పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

సూర్యాపేటలీగల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.లక్ష్మీశారద అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను వైద్యులు సూచించే సూచనలు పాటించి పరిష్కరించుకోవాలన్నారు. జీవనశైలిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్‌కౌసర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రజితగోపు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్లు విజయమనోహరి, వైశ్రీశైలం పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి):జిల్లా స్థాయి యువజన జానపద నృత్య కళాకారుల ఎంపికను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవంబరు 7వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈపోటీల్లో పాల్గొనదలిచిన అభ్యర్థుల వయస్సు 15ఏళ్ల నుంచి 29ఏళ్ల లోపు ఉండాలన్నారు. ప్రతి గ్రూప్‌లో 10 నుంచి 15 మంది సభ్యులు మించరాదన్నారు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాలన్నారు. జానపద పాటలు కూడా గ్రూప్ విభాగంలో ఉన్నాయన్నారు. కథారచన పోటీలు కూడా ఉన్నాయని, ఒక్కొక్కరు ఒక రచనను మాత్రమే సమర్పించాలన్నారు. పెయింటింగ్, ఉపన్యాసం, వక్తృత్వం, కవిత్వం పోటీలు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు తమ వివరాలను నవంబరు 4వ తేదీలోపు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు.